క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి వీరకిషోర్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరుగనున్న సమావేశానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరుకానున్నారని, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అన్నిశాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

4న మండల సమావేశం

బ్రహ్మంగారిమఠం : మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన ఉంటుందని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపాడు. ఈ సమావేశంకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

బి.మఠంలో భక్తుల సందడి



బ్రహ్మంగారి సన్నిధిలో భక్తుల సందడి

బి.మఠం : నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం జిల్లా నలుమూలలనుంచి స్వామివారి దర్శనంకోసం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులను దృష్టిలో ఉంచుకుని దేవస్థానం నిర్వాహకులు ప్రత్యేర్పాట్లను చేశారు. ఈశ్వరీదేవిమఠం, పోలేరమ్మ, బ్రహ్మంసాగర్‌ను భక్తులు తిలకించారు.

15 రేషన్ షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

బ్రహ్మంగారిమఠం : మండలంలో ప్రస్తుతం ఉన్న 43 రేషన్ షాపులకు అదనంగా 15 షాపులు ప్రభుత్వం పెంచింది. ఈ షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సోమిరెడ్డిపల్లె పంచాయతీలో కొత్తూరు, వీరనారాయణపురంకు బీసీ(ఎ)కు సోమిరెడ్డిపల్లె 2 మహిళకు, బి.మఠంకు ఎస్సీ, చెంచయ్యగారిపల్లెకు వినికిడి లోపం ఉన్నవారికి, రామచంద్రాపురం, టి.చౌదరవారిపల్లె వినికిడిలోపం ఉన్నవారికి, రేకలకుంట బీసీ (ఎ), దిరసవంచ ఇతరులు, గొడ్లవీడు మహిళ, బాకరాపేట ఓసీ, ముడుమాల బీసీ(డి), నర్సిరెడ్డిపల్లె ఎస్సీ మహిళకు కేటాయించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈనెల 6లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

వెల్లాలలో ప్రత్యేక పూజలు



సంజీవరాయస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

రాజుపాళెం : నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వాముల ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

28 రేషన్ షాపులకు నోటిఫికేషన్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణ, మండల పరిధిలోని 28 రేషన్ షాపుల డీలర్ల నియామకానికి అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి మున్సిపాలిటీ పరిధిలో 15, మండల పరిధిలో 13 రేషన్ షాపులకు నోటిఫికేషన్ జారీ చేశారు. రిజర్వేషన్ ప్రకారం ఇంటర్మీడియట్ అర్హత గలిగిన అభ్యర్థులు ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. 17వ తేదీ అభ్యర్థులకు రాత పరీక్షను నిర్వహించిన అనంతరం ఇంటర్వ్యూ ఏర్పాటు చేసి ఎంపిక చేయడం జరుగుతుంది. వీటిలో 11 రేషన్ షాపులు బైఫరికేషన్ ద్వారా, మిగిలిన 17 రేషన్ షాపుల డీలర్లు రాజీనామా చేయడంతో భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. 18 నుంచి 40 ఏళ్లలోపు వయసు గలవారు ఇందుకు అర్హులుగా నిర్ణయించారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యా వసర సరుకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో 33వ వార్డులో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులకు బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా కౌన్సిలర్ గాజుల శివజ్యోతి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్ నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలను వెలకట్టలేమని తెలిపారు. అనంతరం కార్మికులకు శాలువా సత్కరించి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మైదుకూరు రోడ్డులోని ఎస్పీజీ-1, గోకుల్ నగర్‌లోని ఎస్పీజీ-2, దొరసానిపల్లెలోని ఎస్పీజీ-3, గోల్డెన్‌జూబ్లీ, రామేశ్వరం సీఎస్ఐ తదితర చర్చిలో నూతన సంవత్సరం 2025 సందర్భంగా బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము, ఉదయం నిర్వహించిన ఈ ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గోకుల్‌నగర్ ఎస్పీజీ-2 చర్చిలో ఫాదర్ రెవరెండ్ కోలాటి రాజు ప్రతి ఒక్కరూ భగవంతుని పట్ల విధేయులై జీవించాలన్నారు. తోటి వారి పట్ల ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని, చేతనైన సహాయం ఇతరులకు చేయాలన్నారు. రామేశ్వరం సీఎస్ఐ చర్చిలో ఫాదర్ రెవరెండ్ డాక్టర్ జాకోబ్ ఫ్రాంక్ నూతన సంవత్సరం అందరికి శుభాలు తేవాలని ప్రార్థనలు చేశారు. క్రీస్తు చూపిన సన్మార్గంలో నడవాలని సూచించారు. కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. నూతన సంవత్సర వాగ్దానం తీసుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఏసు శిలువ ఊరేగింపు

రాజుపాళెం : నూతన సంవత్సర వేడుకలను మండలంలోని గ్రామాల్లో నిర్వహించుకున్నారు. రాజుపాళెం ఎస్సీ కాలనీలో ఏసు శిలువను ఘనంగా ఊరేగించారు. టీసీసీ చర్చిలో అర్ధరాత్రి కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చర్చిలో కొవ్వొత్తులతో 2025 సంవత్సరం అని రాశారు. పాస్టర్లు సీమారాణి, అనిల్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికి శుభాలు కలగాలని వారు ఆకాంక్షించారు. ఇంకా మిగతా గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

చాపాడు : మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య కార్యాలయంలో ఎంపీడీఓ వీరకిషోర్, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఎంపీపీని ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీపీ లక్షుమయ్యతో కలసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

బద్వేలు అర్బన్ : బద్వేలులో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే పట్టణంలో న్యూ ఇయర్ సందడి నెలకొంది. చర్చిలను, ఆలయాలను విద్యుత్తు దీపాలతో సుందరంగా అలంకరించారు. చర్చిలలో అర్ధరాత్రి సామూహిక ప్రార్థనలు జరుపగా దేవాలయాలలో బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీపాలెం సమీపంలోని పురాతన వెంకటేశ్వరస్వామి ఆలయం, నెల్లూరురోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, తెలుగుగంగకాలనీ రోడ్డులోని దత్తసాయిబాబా ఆలయం, ఆర్టీసీ బస్టాండు సమీపంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పలువురు వివిధ శాఖల అధికారులు తమ ఉన్నతాధికారులను కలిసి పూలమాలలు వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విద్యార్థులు తమ స్నేహితులకు గ్రీటింగ్ కార్డులు, చాక్లెట్లు పంచి శుభాకాంక్షలు తెలుపుతూ సందడిగా గడిపారు.

క్రీస్తు బోధనలను జీవితాలలో పాటించాలి

కలసపాడు : మండల కేంద్రంలోని పరిశుద్ధ పరిపేతురు పరిపాలు చర్చిలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు చర్చి చుట్టూ గుడిప్రదక్షణ చేశారు. అనంతరం డీనరీ చైర్మన్ రెవ.ఆనంద్‌కుమార్, రెవ. ఆసిస్ గాబ్రియేల్, ఆర్సీఎం చర్చిలో ఫాదర్ కొత్తపల్లి మనోహర్‌లు దైవ సందేశాన్ని తెలియజేశారు. క్రీస్తు లోకరక్షణార్థం ఈ లోకానికి వచ్చారని, శాంతి నెలకొల్పేందుకు జన్మించారని తెలిపారు. క్రీస్తు లోకానికి వెలుగుగా దేవుని నిబంధనలు, నియమాలు ప్రజలకు వివరించేందుకు ఈ లోకానికి వచ్చారని, క్రీస్తు నేర్పిన బోధనలు మన జీవితాల్లో పాటించి, క్రీస్తు మార్గంలో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : ఎస్పీజీ-2లో కేక్‌కట్ చేస్తున్న రెవరెండ్ కోలాటిరాజు



ప్రొద్దుటూరు : ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



రాజుపాళెం : ఏసు శిలువను ఊరేగిస్తున్న విశ్వాసులు



బద్వేలు : వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కలసపాడు: ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



కలసపాడు: గుడిప్రదక్షిణ చేస్తున్న విశ్వాసులు

ఎంపీజే క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రాజీవ్ పార్కులో ఎంపీజే ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్స క్యాలెండర్‌ను వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కేఎం అబ్దుద సుభాన్ ఆవిష్కరించారు. నూతన సంవత్సంతరం అందరికి శుభాలు తేవాలని ఎంపీజే రాష్ట్రకార్యదర్శి సలీం, రాయలసీమ ఇన్‌చార్జి ఎండీ అయూబ్ ఖాన్ నూతన సంవత్సరంలో అందరికి శుభాలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాషా, మహమ్మద్ రఫీ, సయ్యద్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గోపవరం : వెనుకబడిన ప్రాంతమైన బద్వేలు రెవెన్యూ డివిజన్‌ను అన్ని రంగాల్లో సర్వతోముఖంగా అభివృద్ధి చేయాలని మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం సభ్యులు ఆర్డీఓ చంద్రమోహన్‌కు విజ్ఞప్తి చేసింది. బుధవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్‌లు కలిశారు. ఆర్డీఓను శాలువాతో సత్కరించి మొల్లసాహితీపీఠం దినచర్యను, కాలమానాన్ని ఆవిష్కరించారు. పాఠకుల కోసం గంథ్రాలయం ఏర్పాటు చేయాలని కోరారు.

దేవుని కడపలో భక్తుల సందడి

కడప కల్చరల్ : తిరుమలేశుని తొలి గడప దేవునికడపలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం దైవ దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా కనిపించింది. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించినా ఉదయం 10.30 గంటల వరకు దర్శనం కోసం వచ్చిన భక్తుల సంఖ్య చాలా తక్కువగా కనిపించినా కూడా ఆ తర్వాత క్రమంగా పుంజుకున్నది. 10.30 గంటల తర్వాత ఆ ప్రాంగణం రద్దీగా మారింది. మధ్యాహ్నం 2 గంటల వరకు రద్దీగానే కనిపించింది. ఆలయ నిర్వాహకులు భక్తుల రద్దీని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో ఒక దశలో భక్తులు భారీగా వచ్చినా దర్శనాలకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. అందరికీ తిరుమలేశుని లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉంచారు. నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు ముందే అయిపోవడంతో వాటి కోసం వచ్చిన భక్తుల్లో నిరాశ వ్యక్తమైంది. ఈ మాసమంతా వాటిని అందుబాటులో ఉంచాలని వారు కోరారు. నగరంలోని దాదాపు అన్ని ప్రధాన వైష్ణవాలయాలు భక్తుల సందడితో కళకళలాడాయి. వైష్ణవాలయాలన్నింటిలో ధనుర్మాస పూజలు నిర్వహిస్తుండడంతో వాటిలో ఈ కార్యక్రమాలు కూడా జత కలిసి శోభ పెరిగింది.

పాతపెన్షన్ విధానం అమలు చేయాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఏపీ సీపీఎస్ఈఏ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్రంలోని మూడున్నర లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీరాముపేలట వీధిలోని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విశేష కృషి చేసి సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించామన్నారు. అదే ఒరవడితో సర్వీసు పెన్షన్‌ను కూడా సాధిస్తామన్నారు. డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని, దాన్ని ప్రభుత్వాలు అందించడం బాధ్యత అన్నారు. ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ వెంకటజనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఎర్రగుడి రిజ్వాన్, ఓబులేసు, పుల్లయ్య, పరమేశ్వర్, చాంద్‌బాషా, రోషన్ జమీర్, వారాది మధు, గండికోట బాబా, నాగేంద్రారెడ్డి, జోజప్ప, అబ్బాస్, సుధాకర్, రామిరెడ్డి, చంద్రశేఖర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దోమ తెరలు పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక కూరగాయల మార్కెట్‌లో దస్తుమియా అండ్ సన్స్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం దివ్యాంగులకు దోమ తెరలను, టమాటాలను పంపిణీ చేశారు. నూతన సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు లక్ష్మీనరసయ్య, మహ్మద్ రఫీ, జుబేర్, ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల, వయో వృద్ధుల సేవా సంఘం కన్వీనర్ అఫ్జల్, చలపతి రావు, రషీద్, సురేష్ బాబు, సావిత్రి, చంద్రకళ, యదార్థుడు పాల్గొన్నారు.



దోమతెరలను పంపిణీ చేస్తున్న ఖాదర్‌వలి

నాయకులకు శుభాకాంక్షల వెల్లువ



రాచమల్లుకు శుభాకాంక్షలు చెబుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద



కలసపాడు: ఎమ్మెల్సీ గోవిందరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



పోరుమామిళ్ల : విశ్వనాథరెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్వగృహం బుధవారం పార్టీ శ్రేణులు, అభిమానులతో సందడిగా కనిపించింది. నూతన సంవత్సరం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రాచమల్లుకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌లు కట్ చేయడం, పూలమాలలు, పండ్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచి 11 గంటల వరకు అభిమానుల రాకపోకలతో దొరసానిపల్లెలోని రాచమల్లు స్వగృహం సందడిగా కనిపించింది. జెడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం ఎంపీపీలు సానబోయిన శేఖర్ యాదవ్, ఎస్ఏ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ జీరెడ్డి అంజనీకుమారి, గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ టంగుటూరు మారుతి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి నరసింహారెడ్డి, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ యెల్లాల కుమార్ రెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రారెడ్డి, అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు కోనేటి సునంద, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతితోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సాధారణ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై రాచమల్లుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు

కలసపాడు : నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి కలసపాడు వైఎస్సార్ సీపీ మండల నాయకులు బుధవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోరుమామిళ్లలోని ఎమ్మెల్సీ నివాసంలో భారీ గజమాలతో ఎమ్మెల్సీ గోవిందరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అంకన గురివిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సూదా రామకృష్ణారెడ్డి, సగిలి సుదర్శన్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, బోదనబోయిన నారాయణయాదవ్, సింగరయ్య యాదవ్, ఎస్.భాస్కర్‌రెడ్డి, జాన్ సంజయ్‌రాజు, అంకిరెడ్డి, పగిడి థామస్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

బద్వేలు అర్బన్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డికి ఆయా వార్డుల కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. అనంతరం బద్వేలు మున్సిపాలిటీ, మండల పరిధికి చెందిన పలువురు నాయకులు పోరుమామిళ్లకు వెళ్లి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్‌ను మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు పుష్పగుచ్ఛం అందజేశారు.

కార్యకర్తలతో కిక్కిరిసిన కార్యాలయాలు

పోరుమామిళ్ల : నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు బుధవారం పార్టీ శ్రేణులు నాయకుల ఇళ్లకు, కార్యాలయాలకు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు కన్వీనర్ నల్లేరు విశ్వనాథరెడ్డిలను కలుసుకున్న పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులను భారీ గజమాలలు, శాలువాలతో నాయకులను సత్కరించారు. ఈ సందర్భంగా వచ్చిన కేడర్‌కు నాయకులు కరచాలనం చేస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. ఈ సంవత్సరం ప్రజలకు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు, అభిమానులకు మంచి జరగాలని ఆకాంక్షించారు. అలానే బద్వేలు మాజీ మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ రమణారెడ్డికి కార్యకర్తలు న్యూ ఇయర్ విషెస్ తెలియజేశారు.

అమ్మా నాన్నలే దైవాలు



వృద్ధుడికి ఆహారం తినిపిస్తున్న విద్యార్థి

కాశినాయన : కనిపెంచిన అమ్మానాన్నలే దైవాలని వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మైదుకూరు మండలం జి.వి.సత్రం మార్నింగ్ స్టార్ హైస్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు వివేకానంద సేవాశ్రమాన్ని సందర్శించారు. విద్యార్థులు ఆశ్రమంలోని అవ్వతాతలతో ముచ్చటించారు. వారికి అన్నం తినిపించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదవాలన్నారు. సేవాశ్రమాన్ని ప్రత్యక్షంగా చూడటం వలన పిల్లల్లో సేవాభావం, మానవత్వం లాంటి గొప్ప లక్షణాలు అలవరుచుకోవచ్చన్నారు. పిల్లలు భోజనం తినిపిస్తుంటే అవ్వాతాతల కళ్లు చెమ్మగిల్లాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మిరెడ్డి, ఉపాధ్యాయులు సునీత, రమణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో ఎస్వీ తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ అరటకవేముల హరినారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కోల్‌కతాలో జరిగిన 8వ ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్‌లో 2వ తరగతి చదువుతున్న విద్యార్థిని జీవన గోల్డ్ మెడల్ సాధించిందని తెలిపారు. మూడో తరగతి విద్యార్థి భరద్వాజ్, 4వ తరగతి విద్యార్థి శివశంకర్, 6వ తరగతి విద్యార్థి సంతోష్ బ్రాంజ్ మెడల్స్, 7వ తరగతి విద్యార్థి హరీశ్వర్ రెడ్డి సిల్వర్ మెడల్, ఎస్వీ డిగ్రీ కాలేజీ విద్యార్థి సయ్యద్ అస్లాం బ్లాక్ బెల్ట్ సాధించారని వివరించారు. వీరు ఎస్వీ తైక్వాండో అకాడమీ మాస్టర్ శ్రీనివాసులు వద్ద శిక్షణ పొందారని తెలిపారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

చీరలు పంపిణీ

కడప కల్చరల్: ప్రముఖ జ్యోతిష్య నిపుణులు ముద్దల సురేష్‌బాబు తనయుడు శశాంక్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఎన్జీఓ కాలనీలోని ఆయన స్వగృహంలో నూతన సంవత్సర, జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. సురేష్ దంపతులు ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మనోహర్, స్తోత్ర రాజ్, జాన్, సుజాత, నిర్మల, బుజ్జి, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సోమేశ్వరుని సన్నిధిలో న్యాయమూర్తులు



ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

కడప కల్చరల్: కడప నగరం దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, రామారావు దంపతులు దర్శించుకున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం వారు ఆలయానికి విచ్చేశారు. ఆలయ ఈఓ ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో అర్చక బృందం వారికి ఘనంగా స్వాగతం పలికి ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ఆలయంలో విశేష పూజలు నిర్వహింపజేసి ఆ ప్రాంగణంలో వేదమంత్రయుక్తంగా ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

కడప కోటిరెడ్డి సర్కిల్: రైల్వేశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు విధి నిర్వహణలో భాగంగా నిరంతరం బిజీగా ఉంటారని, ఇటువంటి తరుణంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని రైల్వే డివిజనల్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కడప రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆరోగ్య విషయంగా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించుకుంటూ ఉండాలని, ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తిన సత్వరమే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బయ్య, ఎం.రవికుమార్, అనిల్‌కుమార్, మల్లికార్జున, డేవిడ్, పెంచలయ్య, యశ్వంత్, మస్తాన్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్: పేదల ఆకలి తీర్చేందుకు తవవంతుగా తోడ్పాటు అందిస్తూ అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నగరానికి చెందిన శ్రీ సత్యా ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ భవనాశి సత్యనారాయణ తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ట్రస్టు ఆధ్వర్యంలో కడప నగర పరిధిలోని రిమ్స్‌లో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.